

# స్వర్ణ సౌగంధం

కప్పగంతుల శ్రీకృష్ణ బహదూర్

**సాయంత్రం నాలుగున్నరవుతోంది. ఇంకో పది నిమిషాల్లో పిల్లలు సందీప్, సంయుక్త స్కూల్ నుండి వచ్చేస్తారు. రాగానే ఆకలితో టిఫిన్ కోసం తన పక్కన కూర్చుని గోల ప్రారంభిస్తారు.**

తనకేమో బద్ధకంగా ఉంది. వీళ్ల రోజుకో వెరైటీ అడుగుతారు. 'ఇవ్వాళ ఏం టిఫిన్ చెయ్యడం?'

ఆలోచిస్తూ బాల్కనీలోంచి పిల్లల రాకకోసం చూస్తోంది శృతి.

అది సెకండ్ ఫ్లోర్ ఫ్లాట్. ఆ భవనంలో మొత్తం మూడు ఫ్లోర్లున్నాయి. ఎదురుగా ఒక ఇల్లు కనిపిస్తుంది. అది గ్రౌండ్ ఫ్లోరు మాత్రం ఉన్న ఇల్లు. దానికి రెండు వైపులా మళ్ళీ నాలుగు ఫ్లోర్ల ఫ్లాట్లున్నాయి.

ఆ ఎదురింటికి ఒక చిన్న గేటు, ఇంకో పెద్ద గేటు ఉన్నాయి. ఒకవైపు కారు వెళ్లడానికి తోవ, ఇంటి ముందు చిన్న లాన్, చుట్టూ పూల మొక్కలున్నాయి. ఇల్లు చాలా అందంగా ఉంటుంది.

ఆ ఇంట్లో ఉండే ముఖ్యమైన మనిషి ఇంకా అందంగా ఉంటుంది. ఆమె మరెవరో కాదు, ఆంధ్రులకే కాక, తమిళులకి ముఖ్యంగా యువకులకి ఎంతో ఇష్టమైన ప్రముఖ సినిమా హీరోయిన్ స్వర్ణ. ఆమె ఆ ఇంటికి కొత్తగా వచ్చింది.

స్వర్ణ వివాహితురాలు. ఆమె జీవితంలో ముఖ్యమైన విషయాలు ప్రజలకి తెలుసు.

స్వర్ణకి పాతికేళ్ల వయసుకే ఇద్దరు పిల్లలు కలిగారు. ఆ తర్వాత ఆమె పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించేసుకుంది. ఆ పైన ఒక దుర్దినాన ఆమె భర్త ఆకాశ్, పిల్లలు కారులో వెళ్తూంటే ఆక్సిడెంట్ జరిగి పిల్లలు మరణించారు, ఆమె భర్తకి కాళ్ల పోయాయి. స్వర్ణ తన దుఃఖాన్ని మరిచిపోవడానికి చాలా సినిమాల్లో పని చేస్తోంది. ప్రతి సినిమా సూపర్ హిట్ అవుతోంది.

ఎదురింట్లో స్వర్ణ ఉందన్న మాటే గాని, ఆమెను చూడ్డానికి సాధారణంగా వీలవదు. ఎప్పుడూ అవుట్ డోర్ షూటింగ్‌కి వెళ్తుంది. ఇంటికి తిరిగి వచ్చినా రాత్రి పదకొండో, పన్నెండో అయిపోతుంది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో అందరూ నిద్రలో ఉంటారు.

ఇంటి ముందు వాచ్‌మేన్ ఉంటాడు. అతను స్వర్ణ అభిమానులు వచ్చినప్పుడు తరిమేయకుండా మంచిగా సమాధానాలు చెప్పి, ఆమె లేదని, చూడ్డానికి వీలు కాదని పంపించేస్తాడు.

సాయంత్రం చల్లబడ్డాక కొంతసేపు లాన్‌లో ఆకాశ్ వీల్ చైర్‌లో కూర్చుంటాడు. అతని చేతిలో ఏదో ఒక పుస్తకం ఉంటుంది. అయితే, అది సాధారణంగా చదవడతను. ఆకాశంలోకి చూస్తూ ఆలోచిస్తూ ఉంటాడు. తనకు కలిగిన కష్టాలకి అతను కుంగిపోతున్నాడని ఇరుగు పొరుగుకి అర్థమవుతోంది.

అతన్ని పలకరించి మాట్లాడి, అనవసరపు సలహాలు, ఓదార్పు ఇద్దామని ఎంతో మంది ప్రయత్నించారు.

ఆకాశ్ అంతగా ఎవ్వర్నీ ప్రోత్సహించలేదు. తను ఉత్సాహం తెచ్చుకోలేదు. అతని ద్వారా స్వర్ణకి దగ్గరవ్వాలని పథకం వేసుకున్న వాళ్ల నిరుత్సాహపడ్డారు.

'మొత్తానికి ఏడ్చేవాడు ఒంటరిగా ఏడుస్తాడు!' అనిపిస్తూ అందరూ అతని మానాన అతన్ని వదిలేశారు.

ఆ ప్రాంతంలో పిల్లలు అందరూ పెద్ద క్లాసుల వాళ్లే. ఒక్క సంయుక్త, సందీప్ తప్ప. సందీప్ రెండో క్లాసు, సంయుక్త మూడో క్లాసు చదువుతున్నారు. ఇద్దరూ అందమైన పిల్లలు. వాళ్ల అక్కడ ఉన్న వాళ్లందరికీ ఇష్టమైన పిల్లలు. మరీ చిన్నవాళ్ల కదా!

సంయుక్త అల్లరిపిల్ల, అబద్ధాలు చెప్పి అందర్నీ ఏడిపిస్తూ మొదట కోపం తెప్పించినా, చివరికి ముచ్చట కలిగేలా ప్రవర్తిస్తుంది.

సందీప్ కాస్త బెదురు పిల్లాడు. లావుగా, ఎర్రటి బుగ్గలతో బెరుకుగా చూస్తూ వినయంగా ఉంటాడు.

అక్క ఏడిపించడం, తమ్ముడు ఏడవడం అందరికీ

వినోదంగా ఉంటుంది.

ఆకాశ్ కూడా అప్పుడప్పుడు ఆ పిల్లలిద్దర్నీ చూస్తూ చిరునవ్వు తెచ్చుకున్న సందర్భాలున్నాయి. స్వర్ణ ఒకటి రెండుసార్లు వాళ్లని చూసి, ఇంటికి పిలిచి మిల్క్ చాక్లెట్లు ఇచ్చింది. ఆమె చిన్నారి అభిమానుల్లో ఇంకో ఇద్దరయ్యారు ఆ ఎదురింటి పిల్లలు.

శృతి గానీ, ఆమె భర్త శ్రీకాంత్ గానీ, ఇంకా స్వర్ణతో మాట్లాడలేదు. ఆకాశ్‌తో కొన్నిసార్లు మాట్లాడారు. ఆకాశ్ లాన్‌లోకి వచ్చి కూర్చోగానే శృతి బాల్కనీలో ఉంటే లోపలికి వెళ్లిపోతుంది.

ఆ రోజు ఇంకా ఆకాశ్ బయటికి రాలేదు.

'పాపం, ఏమిటో? అన్నీ ఉన్న దురదృష్టవంతులు!' అనుకుంది శృతి వాళ్ల గురించి ఆలోచిస్తూ.

దూరంగా తమ్ముడిని దబాయిస్తూ సంయుక్త ఏడుస్తూ ఆమె నుండి పారిపోతూ సందీప్ వస్తున్నారు.

"ఊఁ, ఏదో పేచీ వచ్చింది ఇద్దరికీ" అనుకుంది శృతి.

పిల్లలు పరుగులు తీస్తూ ఇంట్లోకి దూసుకువచ్చారు.

'అమ్మా! చూడవే, అక్క నా బాల్ తీసుకుంటోంది' పుస్తకాల బేగ్ కుర్చీలోకి విసిరి శృతి వెనక్కి వెళ్లి దాక్కుంటూ అన్నాడు సందీప్.

'ఊరికే చూసి ఇస్తానంటే ఇవ్వట్లేదు ఈ బడ్డుగాడు' అంది సంయుక్త కోపంగా తన బేగ్‌ని పారేసి వాడి మీదకి వెళ్తూ.

"నేనేం బడ్డు కాదు, నువ్వే కోతివి" అరిచాడు సందీప్ ఉక్రోషంగా.

"పోరా పందీ"

"పోవే కోతీ"

"పోరా ఫాట్ బాయ్"

"పోవే మంకీ"

అందరు పిల్లల్లాగే మాటకి మాట చెప్తూ ఇల్లంతా పరిగెత్తసాగారు.

" సంయూ, సందీ గోల చెయ్యకండి. ఆగండి. అసలు బాల్ ఎక్కడిదిరా నీకు?" గట్టిగా అరిచింది శృతి. పరుగు మాని తల్లి దగ్గరకి వచ్చాడు సందీప్.

"నా ఫ్లెండ్ ఇచ్చాడమ్మా. నన్నే తీసేసుకోమని ఇచ్చాడు. నన్నెప్పుడూ ఏడిపిస్తుంది ఈ మంకీకి ఎందుకు చూపించాలి".

"ఎవడ్రా ఆ ఫ్రెండు? ఎందు కిచ్చాడు?" అడిగింది శృతి.

"లమేష్ అమ్మా. వాడి బర్త్‌డేకి చాలా బాల్స్ వచ్చాయిట. నాకిది ఇచ్చేశాడు. చూడు, బావుందా?" తన నిక్కర్ జేబులోంచి పచ్చరంగు బాల్ తీసి చూపిస్తూ అన్నాడు సందీప్.

శృతి దాన్ని అందుకుని చూసే లోపల సింహంలా ముందుకి దుమికి తమ్ముడి చేతిలోంచి దాన్ని లాక్కుంది సంయుక్త.

"సంయూ" అరిచింది శృతి.

సందీప్ బిక్క మొహం పెట్టాడు.

"పిచ్చి బాల్! ఏం బావుందీ? మన పందిగాడి లాగే రౌండ్‌గా ఉంది" అంటూ దాన్ని బాల్కనీలోంచి విసిరేసింది సంయుక్త.

క్షణాల్లో బంతి భూమిని తాకి అంతెత్తు ఎగిరి స్వర్ణ ఇంట్లో లాన్‌లో మాయమైంది.

సందీప్ బేరుమన్నాడు. వాడిని చూసి నవ్వసాగింది సంయుక్త. వాడు ఆడ పిల్లలాగ, ఇది మగ పిల్లాడి లాగ పుట్టాల్సింది! ఎంత అల్లరి చేస్తుందో ఇది!

శృతి నవ్వాపుకొంది.

"సంయూ! నీ అల్లరి ఎక్కువై పోతోంది. మర్యాదగా వెళ్లి ఆ బాల్ తిరిగి తీసుకురా. నువ్వు చేసిన తప్పు పనికి పనిష్మెంట్ నీకివాళ టిఫిన్ లేదు పో" అంది శృతి కోపం నటిస్తూ.

"ముందు బాల్ తే"

"సరే, సరే" సంయుక్త తలుపు తీసుకుని వెళ్లింది.

"ఏడవకు సందీ" అంది శృతి కొడుకుని చూసి.

"నేనూ బాల్ వెతుకుతా"

సందీప్ కళ్లు తుడుచుకుని బయటకి పరుగు తీశాడు. శృతి టిఫిన్ చెయ్యడానికి వంట గదిలోకి వెళ్లింది. ఇరవై నిమిషాల్లో టిఫిన్ చెయ్యడమైంది. పిల్లలింకా తిరిగి రాలేదు. బాల్కనీలోకి వెళ్లి ఎదురింటి వైపు చూసింది. అక్కడ పిల్లలిద్దరూ స్వర్ణ, ఆకాశ్‌లతో మాట్లాడుతున్నారు.

'స్వర్ణ వచ్చేసిందే. ఇవ్వాళ షూటింగ్ లేదు కాబోలు' అనుకుంది శృతి.

పిల్లలిద్దర్నీ అరిచి పిలిచింది. ఎదురింట్లో నలుగురూ శృతివైపు చూశారు. పిల్లల్ని రమ్మంటూ చెయ్యూపింది శృతి. సంయుక్త స్వర్ణని చూసి ఏదో మాట్లాడింది. స్వర్ణ నవ్వుతూ సమాధానం చెప్పింది.


"అమ్మా! ఆంటీని మనింటికి తీసుకురానా?" అరిచింది సంయుక్త.


"తప్పకుండానూ! అందరూ రండి" సంబరంగా అరిచింది శృతి.

ఈ అరుపులకి ఆ ఫ్లాట్స్‌లో చాలా మందికి స్వర్ణ శృతి ఇంటికి రాబోతోందని అర్థమైంది. రోడ్ క్రాస్ చేసి పిల్లలు, స్వర్ణ వచ్చే లోపల అనేక మంది తమ ఫ్లాట్స్‌లోంచి బయటకి వచ్చి స్వర్ణ కోసం ఎదురుచూస్తూ హడావిడిగా మాట్లాడుతున్నారు. స్వర్ణ ఆ కాంపౌండ్‌లోకి రాగానే ఆడవాళ్లు, మగవాళ్లు, పిల్లలు, వృద్ధులు అందరూ ఆమెవైపు ఇంతింత కళ్లు చేసుకుని చూస్తూ 'హలో' అని పలకరించారు. స్వర్ణ అందరివైపూ చిరునవ్వులు చిందిస్తూ శృతీవాళ్ల ఫ్లాట్‌లోకి వచ్చింది.

"రండి, రండి. నా పేరు శృతి. కూర్చోండి" అంది శృతి ఆనందంతో పొంగిపోతూ.

"ఈ రోజు లొకేషన్‌లో వాన వచ్చింది. షూటింగ్ కాన్సిల్ అయ్యింది. ఇంటికి త్వరగా వచ్చేశాను. మీ పిల్లలు బాల్ కోసం వచ్చారు. వాళ్లతో కబుర్లు చెప్తూంటే, మీ సంయూ పిలిచింది. సరే వస్తానని వచ్చాను. ఇద్దరూ చక్కని పిల్లలు. మీలాగే బాగున్నారు" నవ్వుతూ అంది






స్వర్ణ.

అంత అందాల తార స్వర్ణ తనని మెచ్చుకోగానే శృతి ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యింది.

"ఉప్మా చేశాను. కొంచెం తీసుకోండి" అంది.

గబగబా కిచెన్‌లోకి వెళ్లి టిఫిన్ పట్టుకొచ్చింది. సుతారంగా ఉప్మా తింటూ, మామూలు విషయాలు నవ్వుతూ మాట్లాడ సాగింది స్వర్ణ. పదిహేను నిమిషాలు గడిచాయి. బయట చప్పుళ్లు వినిపిస్తున్నాయి. ఎవరో కాలింగ్ బెల్ నొక్కారు. శృతి తలుపు తీసింది. డోర్ ముందున్న వరండాలో మెట్ల మీద అనేక మంది మనుషులు కుతూహలంగా నిలబడి ఉన్నారు.

ఎదురు ఫ్లాట్ స్మిత నవ్వుతూ శృతివైపు చూసింది.

"సారీ శృతీ! కాలింగ్ బెల్ నొక్కింది నేనే. డిస్టర్బ్ చెయ్యలేదు కదా" అంది.

"అహహ, అదేం లేదు, ఏమిటి?" అంది శృతి మొహం అదోలా పెట్టి.

"ఆటోగ్రాఫ్‌ల కోసం చాలా మంది వచ్చారు. కాస్త ఇప్పిస్తావా?"

"ఉండు అడుగుతాను" అంది శృతి.

"అందరి పుస్తకాలు తీసి ఉంచితే, తర్వాత తీరుబడిగా రాసి ఇస్తాను" అంది స్వర్ణ.

"నువ్వు అందరి దగ్గరా ఆటోగ్రాఫ్ పుస్తకాలు తీసుకుని ఇయ్యి స్మితా" అంది శృతి తలుపు మూసేస్తూ.

ఇంకో ఇరవై నిమిషాలు కూర్చుని వెళ్లింది స్వర్ణ. సాయంత్రం ఆరున్నరకి భర్త శ్రీకాంత్ వచ్చేదాకా శృతికి గాలిలో తేలుతున్నట్లుంది. ఆమెతో మాట్లాడ్డానికి వచ్చే స్నేహితులు, ఆమె ఆనందం ఆమెను ఉక్కిరి బిక్కిరి చేశాయి. భర్త శ్రీకాంత్ వచ్చి కుర్చీలో కూర్చోగానే సంబరంగా అన్నీ చెప్పింది శృతి. శ్రీకాంత్ ఆమె చెప్పినదంతా ఓర్పుతో, శ్రద్ధగా విన్నాడు. కానీ, అంత ఉత్సాహం చూపలేదు.

"శృతీ! కయ్యానికీ, వియ్యానికీ స్థాయి చూడాలంటారు. అలాగే కొన్ని రకాల స్నేహాల్లో కూడా లెవెల్ చూసుకోవాలి. మరీ గొప్పవాళ్ళ స్నేహం కూడా ప్రమాదమే. మన దగ్గర డబ్బు లేనప్పుడు ఏదైనా విద్య అయినా ఉండాలి. ఏదీ లేకుండా, ఇంత శ్రీమంతుల స్నేహం మనకి మంచిది కాదు. జాగ్రత్త, ఈ స్వర్ణ రాకలో ఏదో కారణం ఉండి ఉంటుంది" అన్నాడు గంభీరంగా.

"ఆఁ, అదేం లేదులెండి. మా ఆడవాళ్ల స్నేహాలు వేరు" అంది శృతి తేలిగ్గా.

* * *

ఆరు నెలలు గడిచాయి. శృతీ, స్వర్ణల స్నేహం ఎక్కువైంది. పిల్లల్ని స్కూల్ సెలవుల్లో తనతో బాటు షూటింగ్‌లకి తీసుకెళ్తోంది స్వర్ణ. ఆమె ఇచ్చే చాక్లెట్లు, ప్రెజెంటేషన్స్ చూసి పిల్లలు ఆమె మీద అమిత ఇష్టం చూపిస్తున్నారు. శృతికి ఆ చుట్టు ప్రక్కల విలువ పెరిగిపోయింది.

ఒక చిన్న సినిమా తార, ఒక చిన్న ప్రొడ్యూసర్, డైరెక్టర్ లాంటి వాళ్లతో పరిచయం ఉంటేనే గొప్పగా చెప్పేసుకునే మనుషులు, దానికే వాళ్లకి జేజేలు కొట్టే పిచ్చి మూక ఉన్న ఈ ప్రపంచంలో స్వర్ణ వంటి నెంబర్ వన్ అందాల తారతో పరిచయం ఉందంటే ఇంక ఎంత గౌరవమిస్తారు!

'స్వర్ణ గురించి శృతి ఏమేం చెబుతుందా?' అని తాజా వార్తల కోసం తహతహలాడిపోయే మహిళా లోకం కొద్దో, గొప్పో వస్తువులు, వంటకాలు ఇచ్చి శృతిని మంచి చేసుకుంటున్నారు. శృతికి ఈ పలుకుబడి, ప్రాముఖ్యం మజాగా ఉన్నాయి. ఆమె స్వర్ణకి ఇంకా ఇంకా దగ్గరవుతోంది.

శ్రీకాంత్‌కి ఇదంతా నచ్చట్లేదు. అప్పుడప్పుడు విసుక్కుంటున్నాడు. కానీ శృతి పట్టించుకోవట్లేదు. శ్రీకాంత్ మంచివాడు, ముందుచూపుగల బుద్ధిమంతుడు. అయితే, అనుమానం మనిషి కూడా.

అతను బాగా ఆలోచించి వేరే ఇల్లు చూసుకోవడం ప్రారంభించాడు. శృతికి అర్థం కావట్లేదు. ఎందుకిలా చేస్తున్నారని అడిగింది.

"శృతీ! మనది ప్రేమ వివాహం. మన పిల్లలు మామూలు పిల్లలు కారు. చాలా అపురూపంగా చూసుకుంటున్నాం. మనం వీళ్లని వదిలి ఉండలేం. ఈ స్వర్ణ దంపతులకి పిల్లలు లేరు. ఈమె ధోరణి చూస్తే మన పిల్లల్ని అతిగా మంచి చేసుకుంటోంది. రేపు పెంచుకుంటాను ఇస్తారా అంటే చిక్కులు వస్తాయి. అందుకే వీళ్లకి దూరంగా పోదాం" అన్నాడు శ్రీకాంత్ గంభీరంగా. శృతి అతనివైపు ఆశ్చర్యంగా చూసింది. అతను తన కోసం త్యాగం చేసిన ప్రేమికుడు. తన మేలు కోరుతూ బతుకుతున్న భర్త. అతని మాట తను కాదనలేదు!

"సరే! మీకు తోచినట్లే చెయ్యండి. వచ్చే వారం స్వర్ణ ఊటీకి షూటింగ్ కోసం వెళ్తోంది. తిరిగి రావడానికి పది రోజులవుతుంది. మనం అప్పుడు ఇల్లు మారిపోదాం' ' అంది.

"థాంక్స్ శృతీ! నన్ను అర్థం చేసుకున్నావు" అన్నాడు శ్రీకాంత్ రిలీఫ్‌తో.

ఆ మర్నాడే శ్రీకాంత్ అనుమానం నిజం చేస్తూ స్వర్ణ శృతితో మాట్లాడింది.

"శృతిగారూ, నేనొక విషయం అడిగితే ఏమనుకోరు కదా?" శృతి గుండె వేగంగా కొట్టుకుంది.

"అడగండి ఏమిటో చూద్దాం" అంది.

'ఏం లేదూ, మీ పిల్లలు ఇద్దరూ మా దంపతులకి బాగా నచ్చారు. మీ అమ్మాయి సంయుక్త బాగా చనువు ఏర్పరుచుకుంది. మాకు ఎలాగూ పిల్లలు లేరు. ఇంక పుట్టరు. మీ సంయుక్తని మేము పెంచుకుందామని ఆశ పడుతున్నాం. ఆడ పిల్లని మీరు దత్తత ఇస్తే మీకో భారం తగ్గుతుంది. మా ఆస్తి చాలా ఉంది కాబట్టి ఆ పిల్లను మహారాణిలా పెంచుతాం. మీ అమ్మాయి ఆస్తి పాస్తులతో పెరుగుతూంటే మీకూ సంతోషమే కలుగుతుందని భావిస్తున్నాను. నేను మిమ్మల్ని తొందర పెట్టను. బాగా ఆలోచించి నిర్ణయం చెప్పండి. ఊటీ



3

నుండి వచ్చాక చెప్తే దత్తతకి ఫంక్షన్ ఏర్పాటు చెయ్యచ్చు' అంది స్వర్ణ తియ్యని కంఠ స్వరంతో.

శృతి శరీరం సన్నగా కంపించింది.

"లేదండీ, ఇది జరిగేలా లేదు. సంయుక్త, సందీప్ లిద్దరూ మాకు ప్రాణం" అంది.

"నాకు తెలుసు శృతిగారూ! మీ అమ్మాయిని మీరు ఎప్పుడు కావాలన్నా చూడవచ్చును. ఎటువంటి ఇబ్బందులు కలగవు. మీ ఆయన్ని అడిగి చూడండి' ' అంది స్వర్ణ.

శృతి ఆ రోజే శ్రీకాంత్‌తో చెప్పింది. అతను మౌనంగా తల పంకించాడు.

'ఇల్లు దొరికిందా? మనం వెంటనే ఇల్లు మారిపోదాం' అంది శృతి చిరాకుతో.

స్వర్ణ ఆమెను స్నేహం చేస్తున్నట్లు మోసం చేసినట్లు, తను తెలివి తక్కువ దద్దమ్మలా మోసపోయినట్లు, ఆమె రోజంతా బాధపడుతోంది. శ్రీకాంత్ తెలివి చూసి, అతనంటే గౌరవం కూడా పెరిగిపోయింది.

"ఇల్లు వెతుకుతున్నాను. స్వర్ణని ఊటీకి వెళ్లనీ" అన్నాడు శ్రీకాంత్.

'ఎంత ఇల్లు మారిపోయినా, స్వర్ణ నుండి తప్పించుకున్నా, ఆమె ఇన్నాళ్ళూ చూపిన స్నేహం మర్చిపోయినట్లు ప్రవరిస్తే సంస్కారం అనిపించుకోదు. అందుకని మన కొత్త ఇంటి అడ్రెస్ ఆకాశ్‌కి ఇచ్చి వెళ్దాం' అంది శృతి.

'ఏమో, నీ ఇష్టం. ఆమె అక్కడికి కూడా తయారైతే?' అన్నాడతను.

"అప్పుడు నిజం చెప్పి మనల్నింక ఇబ్బంది పెట్ట వద్దంటాను" అంది శృతి ధృఢంగా.

☆ ☆ ☆ ☆ ☆

కొత్త ఇంటికి మారిపోయి వారం రోజులయ్యింది. వస్తువులన్నీ సర్దుకున్నాక అప్పుడే కొంచెం, కొంచెం ఆ ఇల్లు అలవాటవుతోంది. ఆ రోజు పిల్లలు స్కూల్ కెళ్లారు. శ్రీకాంత్ ఆఫీసు కెళ్లాడు. మధ్యాహ్నం ఇంటిముందు కారాగిన చప్పుడు విని తలుపు తీసి చూసింది శృతి.

డ్రైవర్ గేటు తీసి నిలబడ్డాడు. స్వర్ణ నడిచి వస్తోంది.

"రండి, రండి" అంది శృతి మర్యాదకి.

"ఏమైంది? ఎందుకిలా ఇల్లు మారిపోయారు?" అంది స్వర్ణ లోపలికి వచ్చి కూర్చుంటూ.

"మీరు గ్రహించలేరా?" అంది శృతి చిరాకుగా.

"ఎందుకు గ్రహించలేను. ఎదురింట్లో ఉంటే మీ పిల్లలు ఏదో ఒక సందర్భంలో నన్ను కలుస్తూనే ఉంటారు. కొంచెం వయసు రాగానే నేను సంయుక్తతో ఆమెను పెంచుకుంటానని చెప్పి ఆమెకు ఆశపెట్టి మీ కుటుంబంలో లేనిపోని చికాకులు కలిగిస్తానని భావించి ఉంటారు. నిజంగా శృతీ! ఇన్నాళ్ల స్నేహం చూసి కూడా అంత నీచమైన పనులు చేస్తాననుకున్నారా? సినిమా మనుషులంటే అంత దుర్మార్గులు, నీతీ నియమం, మంచి, మర్యాదా లేని వాళ్లనుకోకండి. నాకూ పెద్దమనిషి తరహాగా ప్రవర్తించడం తెలుసు. నా స్నేహాన్ని స్వార్థం కోసం అని భావించారా? ఆలోచించి మీ నిర్ణయం చెప్పమన్నాను కదా. ఇలా సందేహపడి ఎందుకు రావడం? ఎంత మంది తమ స్వంత పిల్లల్ని దత్తత ఇస్తున్నారో తెలుసా మీకు? ఎవరెవర్నో చూసి మీరూ అలాగే చేస్తారనుకోవడం నా తప్పే. కానీ ఇన్నాళ్ల స్నేహానికి ఒక్కమాట నాతో చెప్పలేకపోయారే!" కోపంగా అంది స్వర్ణ.

"అసలు విషయం అది కాదండీ" అంది శృతి కంగారుగా.

"అయితే ఏమిటో చెప్పండి" అంది స్వర్ణ.

"స్వర్ణగారూ! మీరు ఈ సంగతులు ఎవరికీ చెప్పకూడదు" అంది శృతి.

"సరే చెప్పను, చెప్పండి" అంది స్వర్ణ కుతూహలంగా.

"స్వర్ణగారూ, నేను... గొడ్రాలిని... మా పెళ్లయ్యాక డాక్టరు పరీక్షలో ఈ విషయం తెలిసింది. మాది లవ్ మారేజ్. మావారు నా సంగతి తెలియగానే తనకే పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నారు" అంది శృతి.

'ఓహ్, అలాగా! అయితే ఈ పిల్లలు ఎవరి పిల్లలు?' ఆశ్చర్యపడుతూ ప్రశ్నించింది స్వర్ణ.

"అనాథ శరణాలయం నుండి తెచ్చుకుని పెంచుతున్న పిల్లలు. వాళ్లు పెంపుడు పిల్లలన్న సంగతి మా అత్త మామలకి, నా తల్లి తండ్రులకే తప్ప ఇంకెవరికీ తెలీదు. ఇప్పుడు మీకు తెలిసింది. మావారు తన తల్లి తండ్రులకి ఒక్కరే కొడుకు. అలాగే నేనూ మా అమ్మా నాన్నలకి ఒక్కర్తే కూతుర్ని. ఆ పెద్దల సలహాతోనే మేము చంటిపాపల్లా ఉన్నప్పుడే ఈ పిల్లల్ని తీసుకొచ్చి పెంచుతున్నాం. స్వర్ణా! కన్న ప్రేమ ఎలాంటిదో మాకు తెలీదు. కానీ, పెంచిన ప్రేమ ఎంత బలమైనదో మాకు తెలుసు. రేపు సంయుక్తకి పెద్దయ్యాక ఏమేం తెలుస్తాయో చెప్పలేం. ఆమె వివేకవంతురాలైతే అర్థం చేసుకుంటుంది. లేకపోతే, మీ దగ్గర దివ్యమైన జీవితాన్ని పొందలేకుండా చేశామని మమ్మల్ని ద్వేషించవచ్చు. అది మేము భరించలేం. అందుకనే, మీకు దూరంగా ఉండాలి అని ఇక్కడికి వచ్చేశాం".

తమ జీవిత రహస్యాలు చెప్పేసింది శృతి.

స్వర్ణ చాలాసేపు ఏం మాట్లాడలేక పోయింది.

శృతి కూడా మౌనంగా కూర్చుంది.

"శృతిగారూ! నన్ను నమ్మి మీ రహస్యాలు చెప్పినందుకు నేను గర్విస్తున్నాను. మీరు నా స్నేహానికి గౌరవమిచ్చారు. నేనూ మిమ్మల్ని గౌరవించి ఈ రహస్యాలు ఎవరికీ చెప్పను. మీ కోసం త్యాగం చేసిన మీ వారంటేనూ నాకు చాలా గౌరవం కలిగింది. కన్న ప్రేమకన్నా పెంచిన ప్రేమ గొప్పదని పెద్దలంటారు. మీరు చూపే అమృతం వంటి ప్రేమను నేను విషంలా మార్చకూడదు. కల్మషంలేని సంయుక్త మనసుని మలినం చెయ్యకూడదు. నేనూ ఆ పిల్లలకి ఏమీ చెప్పను. దూరంగా ఉంటూ మీ స్నేహాన్ని కొనసాగిస్తాను. రెండు వైపులా తెలీక పొరపాటు జరిగింది. స్నేహితులు ఒకర్నొకరు క్షమించాలి, సహించాలి. మనం దూరంగా ఉండాలన్న మీ నిర్ణయం సరైనదే. కానీ, మనసులు దగ్గరయ్యాయి. అప్పుడప్పుడు వచ్చి మిమ్మల్ని చూస్తూంటాను. మీరూ వస్తూండండి" అంది స్వర్ణ శాంత స్వరంతో.

ఏదో ఆశపడినా ఆమె స్నేహంలో స్వార్థం లేదు. జరిగిన దానికి ద్వేషించకుండా, అభిమానం చూపుతోంది.

ఒక మంచి స్నేహం అంటే ఇలా ఉండాలి!

గౌరవంతో ఆ సంస్కారం గల స్నేహితురాల్ని సజల నయనాలతో చూస్తూ, తలూపింది శృతి.

---

**ఫలితం**



ఎన్నికలు రాకుండానే బికారిలా వున్నావేంటి?

ఏం చేసేదీ! నేను ఎలక్షన్స్‌లో నిలబడ్డానని తెలియగానే... మా మామగారు ఆస్తి అంతా మా ఆవిడ పేరున మార్చేశాడు!!

- సుధ